క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



రాయపర్తి : మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

వర్ధన్నపేట : వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి, పానిష్‌తండాల వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 2 లీటర్ల గుడుంబాతోపాటు బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఆ శాఖ సీఐ స్వరూప తెలిపారు. వివరాలిలా.. ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ సిబ్బందితో రూట్ వాచ్ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేశారు. వారి వద్ద గుడుంబాతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని చెన్నారావుపేట, ఉప్పరపల్లి, అమీనాబాద్ గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతలు నేపథ్యంలో నేడు (సోమవారం) మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ నర్సంపేట డీఈ తిరుపతి, చెన్నారావుపేట ఏఈ జోగానంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నారావుపేట, ఉప్పరపల్లి, అమీనాబాద్ గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల లైన్లలో మరమ్మతులు చేపడతామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్నేహితురాలికి చేయూత



దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటకు చెందిన దివ్యాంగురాలు సొదారపు లక్ష్మికి ఆమె పదో తరగతి నాటి మిత్రులు చేయూత అందించారు. లక్ష్మి తన తల్లి ఐలమ్మతో కలిసి జీవిస్తోంది. ఇటీవల ఐలమ్మ మృతి చెందడంతో లక్ష్మి ఒంటరి అయ్యింది. ఈ క్రమంలో ఆమె దుస్థితిని గుర్తించిన 1996–97 విద్యాసంవత్సరంలో పదో తరగతి కలిసి చదువుకున్న మిత్రులు చలించారు. అంతా కలిసి రూ.38 వేలు సమీకరించి లక్ష్మికి ఆదివారం అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో లక్ష్మి స్నేహితులు తోటకూరి లావణ్య, సునిత, అనిత, రమ, అపర్ణ, పాశికంటి రమేష్, రజినీకుమార్, వేణు, అశోక్, భాస్కర్, రాజు, సతీశ్, సంతోశ్‌కుమార్, సంపత్, ప్రభాకర్, చెన్నారెడ్డి, రాజేందర్, చౌదరి, కరుణాకర్, యువరాజు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన దొనికెన కుమారస్వామిని అతడి తల్లి ఐలమ్మ ఇటీవల మృతి చెందగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. అనంతరం గ్రామానికి చెందిన మామిండ్లపల్లి రమణమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు.

పాపయ్యపేటలో..

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి గుర్రం రవిని అతడి తండ్రి నర్సయ్య ఇటీవల మృతి చెందిన క్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. తొలుత నర్సయ్య చిత్రపటానికి సుదర్శన్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, పాపయ్యపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు బుర్ర సుదర్శన్‌గౌడ్, నాయకులు బాల్నె వెంకన్న, అమ్మ రాజేశ్, ముస్కు ఐలయ్య, బండి రమేశ్, మొర్రి కట్టయ్య, భూక్య బాల్‌సింగ్, ముత్యాల సారంగం, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్, కాట్రపల్లిలో..

సంగెం : మండలంలోని తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ కొల్కనూరి ఎల్లస్వామిని ఆమె తల్లి రామక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన క్రమంలో, కాట్రపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు బుచ్చిరెడ్డిని అతడి తల్లి శ్యామలమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం పరామర్శించారు. తొలుత రామక్క, శ్యామలమ్మ చిత్రపటాలకు ధర్మారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ కుమారస్వామి, నాయకులు సారంగపాణి, మల్లయ్య, సంపత్, సదానందం, ఎర్రన్న, వీరాచారి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుష్ఠు నిర్ధారణ సర్వే

- 30 వరకు ఇంటింటా వైద్యపరీక్షలు
- శిక్షణ పూర్తి, సామగ్రి పంపిణీ

గీసుకొండ : జిల్లాను కుష్ఠు రహితంగా మార్చడానికి వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఈనెల 17 నుంచి 30వరకు ఇంటింటా సర్వే చేపట్టనుంది. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి శరీరంపై మచ్చలు ఉన్నవారిని గుర్తించి వైద్య పరీక్షలు చేయిస్తారు. ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించి తగిన చికిత్స అందించడానికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే అధికారులకు శిక్షణ ఇచ్చారు. వ్యాధికి సంబంధించిన ప్రచార కరపత్రాలు, బ్యానర్లను గ్రామాల్లో, ఆరోగ్య కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తున్నారు. సర్వేకు సంబంధించిన సామగ్రిని వైద్య సిబ్బందికి ఇప్పటికే పంపిణీ చేసినట్లు ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆచార్య తెలిపారు.

కుష్ఠు వ్యాధి లక్షణాలు..

శరీరంపై తెల్లని, ఎర్రని రాగి రంగు మచ్చలు ఉండి స్పర్శ లేకుండా మొద్దుబారి ఉండడం, ముఖంపై నూనె పోసినట్లు మెరుస్తూ ఉండడం, దద్దుర్లు రావడం, అరికాళ్లు, అరచేతుల్లో తిమ్మిర్లు రావడం, కనురెప్పలు సరిగా మూసుకోకపోవడం లాంటివి కుష్ఠు లక్షణాలుగా పేర్కొనవచ్చు. ఇంటింటా సర్వేలో ఇలాంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి సమీప పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. కుష్ఠు వ్యాధితో చేతి వేళ్లు వంకర పోవడం, ఫుట్‌డ్రాప్ సమస్య ఉన్నవారికి ఉచితంగా శస్త్రచికిత్సతో సరిచేస్తారు. అలాంటి రోగులకు ప్రభుత్వం రూ.12 వేల చొప్పున అందిస్తుంది. వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే ఎండీటీ చికిత్స అందిస్తారు. వ్యాధి ఏ దశలో ఉన్నా సాధారణ వ్యాధి లాంటిదే అని ప్రజలు గమనించాలని, ఆందోళన చెందకుండా పడకుండా పీహెచ్‌సీల్లో వైద్యులను సంప్రదించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

వ్యాధి సోకేదిలా..

లెప్రే అనే బ్యాక్టీరియాతో కుష్ఠు సోకుతుంది. వ్యాధిగ్రస్తులు తుమ్మినా, దగ్గినా తుంపర్ల ద్వారా దగ్గరలో ఉన్న వారికి వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి ముఖ్యంగా చర్మం, నరాలకు సోకుతుంది. ఇది ఒకరకమైన అంటువ్యాధి కారకం.

రెండు రకాలుగా చికిత్స..

కుష్ఠు వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి ఐదు మచ్చలు ఉంటే పాసీ బ్యాసిల్లరీ (పీబీ)గా గుర్తిస్తారు. ఇలాంటి వారికి ఆరు నెలల వరకు చికిత్స ఉంటుంది. కనీసం 9 నెలల్లో కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఐదు కంటే ఎక్కువ మచ్చలు ఉంటే మల్టీ బ్యాసిల్లరీ(ఎంబీ)గా గుర్తిస్తారు. అలాంటి వారికి 12 నెలలు చికిత్స చేస్తారు. కనీసం 15 నెలల్లో కోర్సు పూర్తి చేయాలి. బహుళ ఔషధ చికిత్సతో కుష్ఠును పూర్తిగా నయం చేయవచ్చని వైద్యులు తెలిపారు. రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖరీదు చేసే మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. 6–12 నెలల వరకు చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. సకాలంలో లక్షణాలను గుర్తించి వైకల్యం కలుగకుండా చూడవచ్చని సూచిస్తున్నారు.



సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

సర్వేకు ప్రజలు సహకరించాలి



ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించి మచ్చలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలి. జిల్లాలో ఇప్పటి వరకు 35 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వ్యాధి తీవ్రత జిల్లాలో తక్కువగా ఉన్నా ముందస్తు జాగ్రత్తలు అవసరం. భయాన్ని వీడి పరీక్షలకు ముందుకు రావాలి. సర్జరీ చేయాల్సి వస్తే రోగికి రూ.8 వేలు, వ్యాదిగ్రస్తులకు ఫ్రీగా ఎంసీఆర్ చెప్పులు, అల్సర్ కిట్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది.

– డాక్టర్ నర్సింహారెడ్డి, ఫిజియోథెరపిస్టు

మహిళల సంక్షేమమే ధ్యేయం

- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధులు రజిత, లతారెడ్డి

దుగ్గొండి : మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధులు రజిత, లతారెడ్డి తెలిపారు. మండలంలోని గిర్నిబావిలో మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదుపై ఆదివారం వారు సమీక్షించారు. ఈ సందర్భంగా రజిత, లతారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలకు ప్రాధాన్యత పెరిగినట్లు తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతోపాటు అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. పార్టీలోనూ మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. మహిళలు రాజకీయాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఆ దిశగా అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. రాష్ట్రంలోని మహిళల సమస్యలను రాష్ట్ర అధ్యక్షురాలు సునీత దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, మండల అధ్యక్షురాలు వెండి సక్కుబాయి, నాయకులు కోతి మమత, బుర్రి సునీత, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును సమీక్షిస్తున్న రజిత, లతారెడ్డి

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

నర్సంపేట : పట్టణంలోని సర్వే నంబర్ 121లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని భూపోరాట కమిటీ అధ్యక్షుడు మంద ప్రకాశ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని మహబూబాబాద్ రోడ్డు పక్కనే ఓ ప్రభుత్వ ఉద్యోగి ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నాడని చెప్పారు. సదరు అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని తహసీల్దార్ శనివారం ఆదేశించారని, అయినా నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. సదరు అక్రమ నిర్మాణాన్ని అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి విచారణ చేపట్టి సదరు ప్రభుత్వ ఉద్యోగిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని ఆక్రమణ నుంచి కాపాడాలని కోరారు. సమావేశంలో భూపోరాట కమిటీ బాధ్యులు బొచ్చు భాస్కర్, వేల్పుగొండ రాజు, మాదాసి కృష్ణ, గణిపాక సంజీవ, ఈదుల స్వామి, గొర్రె శాంతిబాబు, గణిపాక మహేందర్, బాణాల భాస్కర్, మాదాసి సదానందం, బోడ సంజీవ, బొచ్చు వరమ్మ, కంజర్ల మంగమ్మ, భారతమ్మ, పసునూరి యశోద, గుండేటి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

లాఠీచార్జ్ ఘటనపై విచారణ చేపట్టాలి

- మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో కొమ్మాల జాతర ప్రభబండ్లు తిరిగే సమయంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు చేసిన లాఠీచార్జ్‌పై విచారణ చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) సన్‌ప్రీత్‌సింగ్‌ను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. గిర్నిబావిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. కొమ్మాల జాతర ప్రభబండ్లు తిరిగే సమయాన్ని పోలీసులు పాటించలేదని చెప్పారు. సమయం దాటుతోందని ప్రశ్నించిన బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులు అకారణంగా లాఠీచార్జ్ చేశారని ఆందోళన వెలిబుచ్చారు. ఫైరింజన్, వాటర్ కేనన్లు, రబ్బర్ బులెట్లతో బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. బారికేడ్లు పెట్టి, రోడ్డు మూసి నిర్బంధాన్ని విధించారని తెలిపారు. అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించారని మండిపడ్డారు. పోలీసుల తీరును అద్దం పట్టేలా జీపీఆర్ఎస్‌తో కూడిన వీడియోలు, ఫొటోలు తమ వద్ద ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ శ్రేణులపై అకారణంగా లాఠీచార్జ్ చేసిన, అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించిన పోలీసులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రతిఘటనలు తప్పవని స్పష్టం చేశారు. తమ వద్ద ఉన్న ఫొటోలను ప్రదర్శించారు. సమావేశంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, నాయకులు కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, శంకేసి కమలాకర్, మేర్గు రాంబాబు, పిండి కుమారస్వామి, రవీందర్ నాయక్, సింగతి రాజన్న, జనార్దన్‌రెడ్డి, ఓడేటి తిరుపతిరెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

వేడుకగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

దుగ్గొండి : మండలంలోని కేశవాపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వేడుకగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఐదో రోజు యాగశాలలో అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా హోమం నిర్వహించారు. శ్రీదేవి–భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు ఊంజల్ సేవ (ఊయల) నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులతో హనుమత్ వాహనంపై ఆలయ చుట్టూ మేళతాళాలతో శోభాయాత్ర నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తాగునీటి, ఇతర సదుపాయాలను ఆలయ ఈఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కల్పించారు. భక్తులు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ప్రదీప్, సాగర్, దేశికన్, రంగనాథ్, ధర్మకర్తలు కంది తిరుపతిరెడ్డి, జితేందర్‌రెడ్డి, అభినయ్–శ్రేయ, సురేందర్‌రెడ్డి–రమ, ఆలయ ఉద్యోగి అశోక్, తదితరులు పాల్గొన్నారు.



హోమం చేస్తున్న అర్చకులు, భక్తులు

పెద్దమ్మతల్లికి ఘనంగా బోనాలు



పెద్దమ్మతల్లికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

నర్సంపేట : మండలంలోని ఉప్పరపల్లిలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం ఘనంగా బోనాలు నిర్వహించారు. ఆ కుల పెద్దలు చీరబోయిన భిక్షపతి, నిమ్మనబోయిన రమేశ్, సొసైటీ అధ్యక్షుడు వీరస్వామి ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించారు. తొలుత ముదిరాజ్ మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, సొసైటీ అధ్యక్షుడు చెలుకలపెల్లి పెద్ద వీరస్వామి, ఉపాధ్యక్షుడు ఈర్ల చిన్న రమేశ్, కార్యదర్శి ఈర్ల పెద్ద రమేశ్, సభ్యులు చెలుకలపెల్లి చిన్న వీరస్వామి, చీరబోయిన యాకయ్య, ఈర్ల వీరస్వామి, ఈర్ల ఐలుమల్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రవి

నర్సంపేట : కమ్యూనిస్టు ఉద్యమాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. బూర్జువా దోపిడీ పాలకవర్గాలు అధికారంలో ఉన్నంత కాలం ప్రజాసమస్యలు పరిష్కారం కావని ఆయన స్పష్టం చేశారు. మే 12 నుంచి వచ్చే ఏడాది మే 12వ తేదీ వరకు ఆ పార్టీ వ్యవస్థాపక నేత, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించనున్న క్రమంలో పట్టణంలోని ఓంకార్ భవన్‌లో డివిజన్ కార్యదర్శి రాజాసాహెబ్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి రవి హాజరై మాట్లాడారు. పార్టీ వ్యవస్థాపక నేత ఓంకార్ తుదిశ్వాస ఉన్నంత వరకు ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాడారని చెప్పారు. ఓంకార్ జయంతి ఉత్సవాల సందర్భంగా గ్రామ స్థాయి నుంచి ప్రజాచైతన్యయుత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఓంకార్ జీవితం, పోరాట స్ఫూర్తి ఆచరణీయమని తెలిపారు. ఓంకార్ జీవిత చరిత్ర, పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేయాలని ఆకాంక్షించారు. ఓంకార్ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, నాయకులు నాగెల్లి కొమురయ్య, కన్నం వెంకన్న, కేశెట్టి సదానందం, కలకోట్ల యాదగిరి, దామ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో నాయకుడి మృతి

నర్సంపేట : పట్టణంలోని 13వ వార్డు బీజేపీ నాయకుడు ఆవుల ప్రవీణ్ (40) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ప్రవీణ్ మృతదేహానికి ఆ పార్టీ జిల్లా నాయకుడు కంభంపాటి పుల్లారావు ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం రూ.5 వేలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ అధ్యక్షుడి..

దుగ్గొండి : రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మృతి చెందాడు. వివరాలిలా.. మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొంత సాయికుమార్ (27) ఆత్మకూరు మండలంలోని పెంచికలపేటకు వెళ్లి ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి వస్తుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. గాయాలపాలైన సాయికుమార్‌ను ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సాయికుమార్ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

విద్యుత్ పొదుపుతోనే 'గృహజ్యోతి'

- వేసవి నేపథ్యంలో ఠారెత్తుతున్న ఎండలు
- 200 యూనిట్లు దాటితే మోత ఖాయం

సంగెం : మార్చి మొదటి వారం నుంచే సూర్యభగవానుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. నానాటికీ ఎండలు ఠారెత్తిస్తున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రత 40 డిగ్రీలుగా నమోదవుతోంది. ప్రజలు భానుడి భగభగలకు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం భారీగా పెరుగుతోంది. చలి తీవ్రతతో డిసెంబర్, జనవరిలో వాటి వాడకాన్ని తగ్గించిన వినియోగదారులు నెలకు 200 యూనిట్లలోపు మాత్రమే విద్యుత్ వినియోగించి గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లుతో లబ్ధి పొందారు. ఇక మార్చి నుంచి విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఏప్రిల్, మే నెలల్లో విద్యుత్ వినియోగం భారీగా పెరగనుంది. ఈ పరిస్థితుల్లో నెలకు 200 యూనిట్లు దాటితే గృహజ్యోతి పథకం వర్తించకపోగా విద్యుత్ బిల్లు మోత మోగడం ఖాయం. ఈ నేపథ్యంలో జీరో బిల్లు రావాలంటే విద్యుత్ పొదుపు తప్పనిసరి. గృహ వినియోగదారులు విద్యుత్ పొదుపును ఆచరిస్తే భారం తప్పి లబ్ధి చేకూరుతుంది.

మండలంలోని 33 గ్రామ పంచాయతీల పరిధిలో 9 వేల 822 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా ప్రస్తుతం 7 వేల 387 కుటుంబాలకు గృహజ్యోతి పథకం వర్తిస్తోందని అధికారిక రికార్డులు చెబుతున్నాయి. సదరు వినియోగదారులు గత ఫిబ్రవరిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించి గృహజ్యోతి పథకం జీరో బిల్లుతో రూ.19,09,536 విలువైన లబ్ధి పొందారు. వారం రోజులుగా పేద, మధ్య తరగతి కుటుంబాలు అటకెక్కించిన కూలర్లను తీసి శుభ్రం చేసి అవసరమైన మరమ్మతులు చేయించి వినియోగానికి సిద్ధం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఎంత జాగ్రత్తలు తీసుకున్నా విద్యుత్ వినియోగం పెరగడం ఖాయమన్నది జగమెరిగిన సత్యం. వేసవి మొదలైన నేపథ్యంలో గృహజ్యోతి పథకాన్ని కోల్పోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు ఆలోచిస్తున్న పరిస్థితి కనపడుతోంది.

విద్యుత్ పొదుపు ఇలా..

మార్కెట్‌లో 5 స్టార్ రేటింగ్ ఉన్న కూలర్లు, రిఫ్రిజిరేటర్లు, ఇతర విద్యుత్ ఉపకరణాలు మాత్రమే కొనుగోలు చేసి వినియోగిస్తే విద్యుత్ వినియోగంలో కొంత ఆదా అవుతుంది. ఇళ్లలో టీవీ అవసరం లేనప్పుడు రిమోట్‌తో కాకుండా పూర్తిగా స్విచ్‌లు ఆఫ్ చేయాలి. ఫోన్, ఇతర విద్యుత్ చార్జింగ్ పరికరాల వినియోగం అనంతరం ప్లగ్ నుంచి తొలగించాలి. పగటి వేళల్లో విద్యుత్ లైట్లు వేయకపోవడం మంచిది. ఫ్యాన్లు అవసరమైతేనే వేయాలి. రిఫ్రిజిరేటర్లలోని ఫ్రీజింగ్ దశలను కాలానుగుణంగా మార్చుకోవాలి. ఏసీల పిల్లర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఏసీకి 3–5 గంటల వరకు టైమర్ సెట్ చేసుకుంటే కొంత విద్యుత్ ఆదా అవుతుంది.



విద్యుత్ మీటర్ బిల్లు తీస్తున్న సిబ్బంది (ఫైల్)

విద్యుత్ పొదుపు ఉత్పత్తితో సమానం



ఎండలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో విద్యుత్ వినియోగం అధికం కావడం సహజం. పొదుపు చర్యలు పాటించకుంటే బిల్లు భారీగా వచ్చే అవకాశం ఉంది. నెలలో 200 యూనిట్లకు దాటితే గృహజ్యోతి వర్తించదు. వినియోగదారులు విద్యుత్ వృథాను అరికట్టాలి. స్వీయ నియంత్రణ పాటించాలి. అవసరం లేకుంటే ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు, బల్బులు వాడొద్దు. ఇళ్లలో పిల్లలను కూడా ఈ విషయమై చైతన్యవంతం చేయాలి. విద్యుత్‌ను పొదుపు చేస్తే ఉత్పత్తి చేసినట్టే.

- నర్సింహారావు, ఏడీఈ, విద్యుత్ శాఖ

ధ్వజస్తంభ మహాప్రతిష్ఠాపన

పర్వతగిరి : మండలంలోని గోపనపల్లిలోని శ్రీదూడల మల్లికార్జునస్వామి ఆలయంలో శివమూర్తుల ధ్వజస్తంభ మహాప్రతిష్ఠాపన శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆయనకు ప్రధాన అర్చకుడు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయ కమిటీ చైర్మన్, నాయకులు ఎమ్మెల్యే నాగరాజును శాలువాతో సత్కరించారు.

పెళ్లి భోజనాల్లో గొడవ

- కుర్చీతో దాడి.. నలుగురికి గాయాలు

సంగెం: పెళ్లి భోజనాల్లో జరిగిన దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్‌కు చెందిన కప్పల ప్రణవ్‌సాయి వివాహం ఆదివారం ఆశాలపల్లిలోని కూచన గార్డెన్‌లో జరిగింది. పెళ్లి కుమారుడి బాబాయి కప్పల శంకర్ పెళ్లి భోజనాల వద్దకు వెళ్తుండగా పెళ్లి కుమారుడి స్నేహితుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన సిదిరాల శ్రీకాంత్‌తోపాటు ఇద్దరు గొడవ పడుతున్నారు. గొడవ ఎందుకని సముదాయించగా నీవెవరు చెప్పడానికంటూ శ్రీకాంత్ కుర్చీతో శంకర్ తలపై కొట్టాడు. అడ్డువచ్చిన కప్పల సంతోష్, వంగల మనోజ్, అంబటి అంజుశ్రీని దాడిచేసి గాయపరిచారు. దాడిచేసి, దూషించిన శ్రీకాంత్‌తోపాటు మరో ఇద్దరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



గీసుకొండ : ఊకల్ క్రాస్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి


సంగెం : అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. స్పీకర్ దళితుడైనందు వల్లే బీఆర్ఎస్ ఎమ్మెల్యే కించపర్చేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధిష్టానానికి చిత్తశుద్ధి ఉంటే జగదీశ్‌రెడ్డి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నర్సింహానాయక్, నాగరాజు, నాయకులు కోటేశ్వర్, రాజు, జగన్నాథచారి, కిశోర్, రవికుమార్, సంధ్య మల్లికార్జున్, ప్రతాప్‌రెడ్డి, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సంగెం : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గీసుకొండ : కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఊకల్ క్రాస్ రోడ్డు వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. తొలుత మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం ఆ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల రుద్రప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కొండేటి కొమురారెడ్డి, దుపాకి సంతోశ్, సుభాశ్, నాగరాజు, సంపత్, వల్లెం సుధాకర్, దాసారపు సారయ్య, రాజు, అనిల్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

రైతు అదృశ్యం



సుధాకర్‌రావు

సంగెం : మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన రైతు తోపుచర్ల సుధాకర్‌రావు అదృశ్యం అయ్యాడు. ఈనెల 13న సాయంత్రం వ్యవసాయ బావి నుంచి ఇంటికి వచ్చిన అతడి సతీమణి పద్మ సుధాకర్‌రావు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోగా బంధువుల వద్ద వెదికినా కనిపించలేదు. సుధాకర్‌రావు ఇంటి నుంచి వెళ్లి 4 రోజులు గడచినా జాడ తెలియకపోవడంతో పద్మ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. కాగా సుధాకర్‌రావు కూతురు రవళి 2019లో ప్రేమోన్మాది దాడిలో మృతి చెందింది. నాటి నుంచి ముభావంగా ఉంటున్న సుధాకర్‌రావు అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లి 2, 3 రోజులకు తిరిగి వచ్చే వాడని తెలిసింది. ఈనెల 15న ఉదయం 10 గంటల వరకు సుధాకర్‌రావు ఫోన్ రింగ్ అయ్యిందని సమాచారం. ఎవరికైనా సుధాకర్‌రావు ఆచూకి తెలిస్తే సెల్ నంబర్ 87126 85029, 8712685243లకు సమాచారం అందించాలని ఎస్సై నరేశ్ కోరారు.